# కొడుకు

- జి.అనసూయ

పేదరికంలో పుట్టి బ్రతుకు కోసం, చదువు కోసం తపించి పోరాడి జీవితంలో అత్యున్నత శిఖరాలకు చేరిన శశిధర్ తల్లి అనారోగ్యం కబురు వినగానే ఆఘమేఘాల మీద ఊళ్ళో వాలాడు.

ఉబ్బసం వ్యాధితో మంచం పట్టిన తల్లిని సిటీలో ఉన్న పెద్ద హాస్పిటల్‌లో చేర్చి, స్వయంగా దగ్గరుండి సపర్యలు చేస్తున్నాడు. బిపి, పల్స్, టెంపరేచర్ అన్నీ నార్మల్‌గానే ఉన్నా తల్లి తీవ్రమైన ఉద్వేగానికి లోనవుతూ ఉంది.

గత నాలుగైదురోజులుగా స్పృహలోనే ఉండి, అందర్నీ చూసి గుర్తుపట్టగలుగుతున్నా మాట్లాడలేకపోతోంది. మాట్లాడాలన్న ఆత్రుతతో ప్రయత్నం చేస్తున్నా నోటి నుండి మాట పెగలడం లేదు.

డాక్టర్లు ఎన్నో పరీక్షలు చేశారు. వాళ్ళ ప్రయత్నం వాళ్ళు చేస్తూనే ఉన్నారు. తల్లి దీనంగా చూసే చూపులు, ధారలుగా వర్షిస్తున్న కన్నీళ్ళు శశిధర్ గుండెల్ని పిండేస్తున్నాయి. ఆమెకు ఇష్టమైనవన్నీ తెప్పించాడు. నలుగురు అక్కలనూ, వారి పిల్లలను రప్పించాడు.

వైద్యం వల్ల ఉపయోగం లేదు. ఇంటివద్దనే ప్రశాంత వాతావరణంలో ఉంచడం వల్ల బహుశా తొందర్లోనే మాట రావచ్చునన్నారు డాక్టర్లు. ఇంకేం ఇంట్లోనే సకల సౌకర్యాలు ఏర్పాటుచేసి అహర్నిశలు కనిపెట్టుకుని ఉంటున్నాడు.

నలుగురు ఆడపిల్లల తరువాత పుట్టిన వంశోద్ధారకుడనేమో శశిధర్‌ను కాలు క్రింద పెట్టనిచ్చేది కాదు వాళ్ళమ్మ. ఉన్న కుటుంబం కాకపోయినా ఉన్నంతలో గుండెలమీద పెట్టుకుని పెంచింది. ఆడపిల్లలను పనికి పంపించినా తనను మాత్రం బడికి పంపించింది.

"ఈ తల్లి కడుపున పుట్టినందుకు నీవేనాడూ బాధపడకూడదు నాయనా" అనేది.

పదో ఏట తండ్రి చనిపోతే అప్పటినుంచి తల్లి తండ్రి తానే అయ్యి పెంచింది. ఉన్నంతలో ఆడపిల్లలను ఉండీ లేని సంసారాలలోనే ఇచ్చి పెళ్ళిళ్ళు చేసింది.

"నీకు తమ్ముడంటే ఇష్టం భవిష్యత్తు తప్ప మా గురించి ఎప్పుడూ ఆలోచించవు" అని గొణుక్కునే వాళ్ళు ఆడపిల్లలు.

"రేపు మీకు కష్టమొస్తే చూసేవాడు వాడే కదే.." అనేది. పైకి అలా అన్నా అక్కలకు తనంటే ప్రాణం.

"ఇంతమంది కష్టపడుతుంటే తను హాయిగా చదువుకోవడం ఏమిటి నేను కూడా చదువు మానేసి ఏదైనా పని చూసుకుంటాను" అనేవాడు తను.

"వద్దునాయనా. ఏ ఉన్న మారాజుల ఇంట్లోనో సుఖంగా పెరగవలసినవాడివి. నీవు చదువుకుని మంచి ఉద్యోగం చేస్తుంటే ఈ కష్టాలన్నీ తీరిపోయి మంచిరోజులు రావా" అనేది తన తల్లి.

బహుశా ఆమె ఆశీర్వాదబలమేనేమో ఎక్కడా ఆటంకమన్నది లేకుండా స్కాలర్‌షిప్‌లు, ట్యూషన్ల సాయంతో ఒక్కొక్క మెట్టే ఎక్కి ఈనాడు డాక్టరేట్ చేసి ప్రొఫెసర్‌గా ఎదగగలిగాడు.

తను సంపాదించడం మొదలుపెట్టాక మొదటి అయిదారేళ్ళు తల్లికి, అక్కలకు కావలసిన సౌకర్యాలను ఏర్పరచడానికే తన డబ్బంతా ఖర్చుపెట్టాడు.

"పెళ్ళిచేసుకో బాబూ! నీ చల్లని సంసారాన్ని చూసి ప్రశాంతంగా కళ్ళు మూస్తాను" అనేది అమ్మ.

"అమ్మా! ఇదిగో నీ కోడలు" అంటూ శైలిని పరిచయం చేసినప్పుడు కులం గోత్రం అంటూ చూడకుండా మనస్ఫూర్తిగా ఆశీర్వదించింది అమ్మ. అలాంటి తల్లి ఈరోజు నిస్సహాయంగా మరణశయ్య మీద తనతో ఏదో చెప్పాలని చెప్పలేక కన్నీళ్ళు పెట్టుకుంటుంటే ఏమీ చెయ్యలేని అసహాయతకు కుమిలిపోతున్నాడు శశిధర్.

ఆరోజు రాత్రి రెండయిందేమో తల్లి మంచం పక్కనే సోఫాలో పడుకుని ఉన్న శశిధర్ సడెన్‌గా తల్లి పిలిచినట్టయి లేచి కూర్చున్నాడు. అవును అమ్మనే... అమ్మ పిలిచింది. తల్లి అరుపు విన్న లేగదూడలా అతని మనసు ఆనందంతో ఉరకలు వేసింది.

"అమ్మా..." అంటూ తల్లి మంచం దగ్గరకు ఒక్కంగలో వెళ్ళాడు. "నాయనా శశీ..." అంటూ లేవబోతున్న తల్లి భుజాలు పట్టుకుని లేపి దిండ్లకానుకుని కూర్చోబెట్టాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. అంతా గాఢనిద్రలో ఉన్నట్లున్నారు. "ఎన్నాళ్ళయిందమ్మా నీ పిలుపు విని" అని గ్లాసులో నీళ్ళు తెచ్చి త్రాగించాడు.

"నాయనా! శశి నీకో సంగతి చెప్పాలి. తలుపు వేసిరా" అంది తల్లి.

"ఇప్పుడెందుకమ్మా... నీవసలే నీరసంగా ఉన్నావు"

"లేదు నాయనా... ఈ సంగతి చెప్పకుండానే ప్రాణాలు పోతాయేమోనని భయపడ్డాను. చేసిన పాపం చెప్పుకుంటే పోతుందంటారు.. నేను నీకు చేసిన ద్రోహం ఇలా నాలోనే దాచుకుని పోతే నాకు ఆత్మశాంతి ఉండదు బాబూ. తీరా విన్నాక ఈ అమ్మను అసహ్యించుకోవు కదూ" ఆయాసంతో ఆగింది.

"లేదమ్మా అమ్మను అసహ్యించుకోవడమా.. నాకు జన్మజన్మలకు నీవే తల్లివి కావాలి" ఉద్వేగంగా అన్నాడు శశిధర్.

తన శక్తినంతా కూడదీసుకుని చెప్పడం మొదలుపెట్టింది.

* * *


అది నలభై ఏళ్ల క్రిందటి మాట. ఆదిరాల చిన్న గ్రామం. హైదరాబాద్ నగరానికి ముప్పయి కిలోమీటర్ల దూరమే అయినా అమాయకత్వం, నిరక్షరాస్యత వారసత్వంగా అయిదారువేల జనాభాతో వెనుకబడ్డ జిల్లాలోని వెనుకబడ్డ గ్రామం అది.

బాణం గుర్తుతో ఆదిరాల అని బోర్డున్న చోట బస్సును రెండు నిముషాలు ఆపాడు డ్రైవర్.

భారంగా ఓ చేతిలో సంచి మరో చేత్తో కూతుర్ని పట్టుకుని బస్సు దిగింది కాంతమ్మ. అవడానికి జూన్ నెల అయినా పెళ్ళున కాస్తున్న ఎండ. తొమ్మిదోనెల కడుపు. నుదుటున ఉండుండి బొట్లు

బొట్లుగా కారుతున్న చెమటచుక్కలు. భారంగా నడుస్తూ ఊరి బాట పట్టింది. మనసులోని దిగులంతా నడకలో కనిపిస్తూ దూరాన్ని మరింత పెంచుతున్నది. అడపాదడపా పలకరించిన ఊరివాళ్లకు సమాధానాలు చెబుతూ కిలోమీటర్ దూరం నడవడానికి గంటన్నర పట్టింది.

మధ్యాహ్నం మూడు దాటిందేమో పగటి కునుకు తీసి అప్పుడే బయటకు వచ్చిన శాంతమ్మ దూరాన నడిచి వస్తున్న కూతుర్ని చూసి ఆందోళన పడింది. "అలా ఒంటరిగా ఎండలో వచ్చావేమిటే... ఉట్టి మనిషివి కూడా కాదు" కూతురి చేతిలోని సంచి అందుకుని మనవరాలి బుగ్గలు పుణికి లోపలికి తీసుకెళ్లింది.



"మీ అత్తా పిల్లలూ బాగున్నారామ్మా. అల్లుడు కూడా రాకపోయాడా ఇలా ఒక్కదాన్నీ పంపించే కంటే" మంచి నీళ్ళు ఇస్తూ అంది శాంతమ్మ.

"అంతా బాగానే ఉన్నారమ్మా నా తలరాత తప్ప. నోటికి చెంగు అడ్డం పెట్టుకుంది కాంతమ్మ. ఈసారి నెల తప్పినప్పటినుంచి ఒకటే సతాయిస్తున్నారమ్మా. ఒకటే తిట్లు, శాపనార్థాలూ "ఈసారి మగపిల్లాడు పుట్టకపోతే ఈ ఇంటి గడప తొక్కవద్దు" అంటూ వెళ్లగొట్టారమ్మా.. మా అత్త ఆయనకు వేరే పెళ్ళి చేస్తానంటూ బెదిరిస్తున్నది" వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పింది కాంతమ్మ.

"అయిదోకాన్పు మగపిల్లవాడు పుడతాడని పంతులుగారు చెప్పారు. నీవేం దిగులుపడకు. కొడుకు పుడితే నీ బాధలన్నీ తీరిపోతాయి. ఇంతకూ అల్లుడు ఏమంటున్నాడు"

" ఆయన తల్లిచాటు మనిషమ్మా. తల్లితో పాటూ ఆయన కూడా తప్పంతా నాదే అన్నట్లు మాట్లాడుతాడు.

దరిద్రపు గొట్టు మొహం... నీ వల్ల మా వంశం మునిగేటట్లున్నది. నలుగురు ఆడ దయ్యాలను కనిపారేస్తే నా కొంపేం కావాలె. వీళ్లకు తిండి, బట్ట ఎవరు పెడతారు. రేపు వీళ్ల పెళ్ళిల్లెట్లా చెయ్యాలె. మీ నాయిన ఇచ్చిన రాసులు న్నయ్యా ఈడ. ఇదే ఆఖరి మాట. ఈసారి ఆడపోరి పుట్టిందో ఇక మల్ల నీ ముఖం జూడను. అడ్నె ఏ నుయ్యో గొయ్యో చూసుకో అన్నడు...'' ఏడుస్తూ చెప్పింది కాంతమ్మ.

కూతురికి ధైర్యం చెప్పడానికైతే అంది కానీ మనసులో గుబులు మొదల య్యింది శాంతమ్మకు. 'నాయనా ఏడుకొండలవాడా నా బిడ్డ కాపురం నిల బెట్టు' మనసులోనే దేవుడికి మొక్కుకున్నది.

★ ★ ★

నాలుగురోజులు గడిచిపోయినాయి. తల్లి స్వాంతన వచనాలు, తగినంత విశ్రాంతి, వేళకు తిండి కాంతమ్మ మొహంలో చిగురించిన జీవకళ, తేలికైన మనసుతో మనుష్యుల్లో పడ్డా మనసులోని దిగులు మాసిపోలేదు.

ఓ రాత్రి హఠాత్తుగా నొప్పులు మొదలయ్యాయి. అప్పటికప్పుడు ప్రయా ణమై పట్నం తీసుకెళ్లింది శాంతమ్మ. "కాన్పుకు ఇంకో రెండురోజుల టైముంది. ఎలాగూ వచ్చారు కదా. ఇక్కడ్నే ఉండండి. పేషెంట్ బాగా నీర సంగా ఉంది. అయిదో కాన్పు. వెంట వెంట పిల్లలు. ఏమ్మా ఈసారన్నా ఆపరే షన్ చేయించుకుంటావా..'' అంది డాక్టరమ్మ.

"మగపిల్లవాడు పుడితే అట్లానే చేపిస్తా డాక్టరమ్మా'' శాంతమ్మ బదులి చ్చింది.

కాంతమ్మ కళ్లలో సుడులు తిరుగుతున్న కన్నీళ్ళు 'మళ్లీ ఆడపిల్ల పుడితే.. తన కాపురం..' భయం మనసంతా ఆవహించి వణికిస్తూంటే...

"ఏందట్ల ఉన్నావు కాన్పుకొచ్చి ఆ కన్నీళ్లేంది'' అంటూ పలకరించింది ఓ ఆయా ఒంటరిగా కూర్చుని కన్నీళ్ళు వత్తుకుంటున్న కాంతమ్మను.

"ఐదో కాన్పు. ఈసారన్నా మగపిల్లాడు పుట్టకపోతే మా అత్త, నా పెనిమిటి ఇంట్లకు రానియ్యరు. ఈ కాన్పుల నేను చచ్చిపోయినా బాగుండేది'' బావురు మంది కాంతమ్మ.

"ఛ... అట్ల ఏడుస్తరా...ఈ మొగోళ్ళకు బుద్ధిలేదు. ఇదంతా ఆడదాని పాప మన్నట్లు మాట్లాడతారు. నేనో ఉపాయం చెబుతా వింటావా'' అంటూ చెవిలో చెప్పింది.

"..నీవే ఫికరు జెయ్యకు. ఒకవేళ నీకు ఆడపిల్ల పుట్టినా నీకు మగపిల్లగాడ్ని ఇచ్చే పూచీనాది. మూడోకంటికి తెల్వకూడదు. వెయ్యి రూపాయలు ఖర్చవు తాయి. నీవు అవునంటే అయిదొందలు ఇప్పుడియ్యి. మిగతాయి పనయ్యాక ఇద్దువుగాని'' అంది ఆయా మస్తానమ్మ.

"ఒకవేళ మగపిల్లవాడు పుడితే...'' ఆమె మనసులోని సందేసాన్ని చదివిన ట్లుగా

"నీ పైసలు నీకు ఇస్తా బిడ్డా...నీ సొమ్ము నాకెందుకు'' అంది మస్తానమ్మ.

ఈ ఉపాయం బాగానే ఉంది 'తల్లితో చెప్పాల్నా...వద్దులే పెదవి దాటితే పృథివి దాటుతుందని...నోరుజారి ఎక్కడన్న అన్నదంటే పెద్ద రబస అయిపో తది' అనుకుంది. ఆ సాయంత్రం తన మెడలోని నల్లబూసలు తీసి తల్లి చేతుల్లో పెడుతూ "అమ్మా ఇది అమ్మి వెయ్యి రూపాయలు తీసుకురా'' అంది ఓ నిర్ణయానికి వచ్చినట్లు.

"ఎందుకే ఇప్పుడు గన్ని పైసలు. కాన్పు కూడా సులువుగానే అయితద న్నది కదా డాక్టరమ్మ...''అంది శాంతమ్మ అనుమానంగా.

"నీకు తెల్వదులే అమ్మా.. ఏదో దానికి ఖర్చులకు ఉంటయిలే'' అంది కాంతమ్మ.

మర్నాడు రాత్రి పదకొండుగంటలకు నొప్పులు మొదలై తెల్లవారుజామున కాన్పయింది. లేబర్‌రూంలో మస్తానమ్మ తప్ప మరెవ్వరూ లేరు. కాంతమ్మ కాక ఇంకో ఆమె కూడా నొప్పుల పడుతున్నది. పది నిముషాల తేడాతో రెండు కాన్పులు అయినాయి. "ఇగో ఆడపిల్ల.. నీకేం భయంలేదు. నేను అంతా సరిజే స్తగా'' అంది మస్తానమ్మ. చేతుల్లో అప్పుడే పుట్టిన పసికందును చూపుతూ బిడ్డల్ని కడగడానికి తీస్కపొయ్యి తెచ్చింది. పువ్వులాంటి మగపిల్లాడ్ని.

కాంతమ్మ మనసులోనే కోటి దేవుళ్లకు మొక్కుకున్నది. "ఏవమ్మో.. మన వడు పుట్టిండు చూసుకుందువుగాని లేవు'' అంటూ నిద్రపోతున్న శాంత మ్మను లేపింది మస్తానమ్మ. మూడోరోజు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేపిం చుకున్నది కాంతమ్మ. వారసుడు పుట్టిండన్న వార్తతో అత్త, భర్త వచ్చిండ్రు. పిల్లవాడ్ని ఎత్తుకుని ముద్దులాడిండ్రు.

"గంత భయపెడితే గానీ వీడ్ని కనలే'' కోడలి బుగ్గలు పుణికింది కాంతమ్మ.

"నెలలోపలే మా ఇంటికి పోయి దావతు చేస్తం'' అన్నారు.

"పచ్చి బాలింత. ఆపరేషన్ అయిన మనిషి. మూడోనెల తీసుకుపోండ్రి''

## బాధ

"మీ ఆవిడ ఎప్పుడూ టీవీ సీరియల్స్ చూస్తూ నీ చేత పనులన్నీ చేయిస్తుంటే నీకు బాధగా ఉండదా రామూ'' అడిగాడు రాజు.

"బాధెందుకూ? నేను చేయలేని పని టీవీ చేస్తున్నందుకు ఆనందంగా వుంటేనూ'' సంతోషంగా అన్నాడు రాము.

"నువ్వు చేయలేని పనా?''

"నా భార్యని ఏడిపించడం నేను చేయలేనుకదా''

## కష్టపడి

"ఆయన క్రిందనుంచి పైకొచ్చిన వ్యక్తి'' చెప్పాడు రామనాథం.

"అంటే ఆయన జీవితంలో చాలా కష్టపడి వుంటారు'' అన్నాడు సోమ నాథం.


"కష్టమా నా బొందా... మొదట్లో షూ పాలిష్ చేసేవాడు. ఇప్పుడు హెడ్ మాలిష్ చేస్తున్నాడు'' చెప్పాడు రామనాథం.

## సంతకం

"ఒరేయ్ అనిల్! ఈసారి పరీక్షల్లో కూడా నీకు మార్కులు తక్కువ వచ్చాయనుకో... ఏం చేస్తావు'' అడిగాడు కుమార్.

"ఏముందీ... ఎప్పటిలాగే ప్రోగ్రెస్‌కార్డ్‌ని ఇంట్లో చూపించకుండా నేనే సంతకం పెట్టేస్తాను'' నవ్వుతూ చెప్పాడు అనిల్.

-కె.చంద్రకళ (చెన్నై)



అన్నది తల్లి.

"అయితే ఆడపోరలను తోల్కొస్త, తమ్ముని చూడాలని ఒకటే వెంట పడు తున్నరు" అన్నాడు అల్లుడు.

అన్నమాట ప్రకారం మస్తానమ్మకు మిగతా ఐదొందలు ఇచ్చి చేతులెత్తి దండం పెట్టింది కాంతమ్మ. తన బిడ్డను ఎవరికి ఇచ్చిందో అడగాలనుకున్నది. కానీ ధైర్యం చాలలేదు. కొడుకు పుట్టడంతో కాంతమ్మ కష్టాలన్నీ తీరినట్ల యింది. మాటిమాటికీ అదిలింపులు, సవతిని తెస్తానన్న బెదిరింపులు లేవు. ఆరోగ్యంగా దొరబాబులా ఉన్న పిల్లవాడిలో తన పోలికలు వెతుక్కునేవాడు కాంతమ్మ భర్త.

"అచ్చం తాత పోలిక" ముద్దులాడేది అత్త ఎప్పుడో పోయిన భర్తను తల చుకుంటూ.

★ ★ ★

కాంతమ్మకు కొడుకుంటే ప్రాణం. వాడి వంటికి మట్టి అంటకుండా చూసు కునేది. చందమామలా ఉన్నాడని శశిధర్ అని పేరు పెట్టారు. లేకలేక పుట్టిన తమ్ముడ్ని అపురూపంగా క్రింద దించకుండా ఎత్తుకుని ఆడించేవారు ఆడపి ల్లలు. శశి అయిదో తరగతిలో ఉండగా హఠాత్తుగా చనిపోయాడు తండ్రి. తల్లి, ఆడపిల్లలు రోజల్లా కష్టం చేసి ఇల్లు గడిపేవారు. ఉన్నదాంట్లోనే రెండకరాలు అమ్మి పెద్ద పోకడలకు పోకుండా ఒక్కొక్క ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసింది కాంతమ్మ. ఎంత లేకున్నా కొడుకు చదువు మాత్రం ఆపలేదు. పాలమ్మి, పిడ కలమ్మి పైస, పైస పోగుజేసి కాలేజీ ఫీజులు కట్టేది.

"ఎందుకమ్మా నాకోసం అంత కష్టపడతావు. నేను చదువు మానేసి ఏదన్నా ఉద్యోగం చూసుకుంటా అనే శశిని,

"వద్దు నాయనా! నీవు చదువుకుని మంచిగా ఉంటే మన కష్టాలన్నీ తీరిపో తాయి." అంటూ ధైర్యం చెప్పేది.

"ఏ జన్మశాపమో ఈ ఇంట్ల బిడ్డవు. ఏ ఉన్నోళ్ళ ఇంట్లోనో పెరగాల్సిన వాడివి" అంటూ మధనపడేది.

ఉన్న వాళ్లింట్లో పుడితే సౌకర్యాలు ఉంటాయేమోగానీ ఈ చల్లని తల్లి ప్రేమ దొరికేదా. అమ్మ చూపే ఆప్యాయత చాలు కొండల్ని కూడా కదిలించే శక్తినివ్వడానికి. డబ్బు ఇబ్బంది ఉన్నా తనేనాడూ నిరాశపడలేదు. బాగా చద వాలి, మంచి ఉద్యోగం చెయ్యాలి. అమ్మను సుఖపెట్టాలి. తన భవిష్యత్తు కోసం చిన్నతనంలోనే పెళ్ళిళ్లయి పేదింటి కాపురాలు చేస్తున్న తన తోడబుట్టి నవాళ్ళ కష్టాలు తీర్చి వారి రుణం తీర్చుకోవాలి. ఇదే ధ్యాసతో రేయింబవళ్ళు చదివేవాడు శశిధర్. ఆఖరుకు అనుకున్నది సాధించాడు.

మాట్లాడుతున్న కాంతమ్మ ఆయాసంతో ఆగింది. ఆమె బలహీనమైన శరీరం జ్ఞాపకాల బరువును ఓపలేక నీరసపడింది.

"నాయనా శశి! ఈ అమ్మ చేసిన పనికి కోపం తెచ్చుకోకు నాయనా. ఈలో కంలో ఆడదానిగా పుట్టడమే ఓ దురదృష్టమైతే ఆడపిల్లలను కనడం మరో అప రాధం. ఆడయినా, మగయినా వారి పుట్టుకకు తల్లిదండ్రులు ఇద్దరూ సమాన బాధ్యులే అన్న విషయం అర్థం చేసుకోలేని మీ నాన్న మూర్ఖత్వం. పుట్టే బిడ్డ ఆడనో, మగనో నిర్ణయించలేని నా అసహాయత, ఆ పరిస్థితుల్లో ఆత్మహత్య తప్ప వేరే గత్యంతరం లేక తీరా నేను చచ్చిపోతే నలుగురు పిల్లలు ఏమైపోతా రోనన్న ఆలోచనతో నేనీ పనిచేశాను. మరో తల్లి కన్న బిడ్డవైన నిన్ను మస్తా నమ్మ నా కొడుకుగా పక్కలో వేస్తే నా స్వార్థం కోసం కన్నతల్లి నుండి నిన్ను దూరం చేశానన్న బాధతో ఎన్ని రాత్రులు ఏడ్చానో ఆ దేవుడికే తెలుసు. వేరే తల్లి బిడ్డగా పెరిగిన నా బిడ్డ ఏడుందో ఎలా బ్రతుకుతుందో అని నేనేనాడూ ఆలోచించలేదు. నా బిడ్డవైన నీకు ఏ లోటు రాకుండా పెంచాలనే నా ప్రయత్నం... ఈ తల్లిని మన్నిస్తావా బాబూ" అంది కాంతమ్మ.

'అమ్మ చెప్పింది నిజమా. నేను ఈ తల్లి బిడ్డను కానా.. మరి ఆ తల్లి నుండి నేను పొందిన ప్రేమ.. అంతా అబద్ధమా. తన బిడ్డకాని బిడ్డను ఏతల్లైనా ఇంతగా ప్రేమించగలదా? ఒక్కనాడైనా మాట వరసకైనా నన్ను వేరుచేసి చూడలేదే. ఒకవేళ అమ్మ మతిస్థిమితం తప్పి అపస్మారకంలో మాట్లాడిం దేమో. ఇదంతా నిజమైనా అమ్మను నేను ఎందుకు తప్పు పట్టాలి'

'నపుత్రస్య గతిర్నాస్తి' అంటూ పుత్రుడు లేకపోతే పున్నామ నరకం తప్పదనే హైందవ నమ్మకం నరనరాన జీర్ణించుకున్న సమాజంలో అమ్మలాంటి అబ లలు కొడుకు కోసం ఎన్ని పాట్లు పడేవారు. పుట్టిన ఆడశిశువులను చంపే యడం... ముందుగానే తెలిస్తే పిండంగానే అంతం చెయ్యడం... బ్రతికి ఉండ గానే చెత్తకుండీల్లో పడేయడం.. అమ్మలాంటి అమాయకస్త్రీలు...వారి అసహా యతను సొమ్ము చేసుకుందామనుకునే మస్తానమ్మలు... ఆలోచనలతోనే తెల్ల వారిందా రాత్రి. గుండె బరువు దించుకున్న కాంతమ్మ గాఢనిద్రలోకి జారు కుంది. ప్రశాంతత నిండిన చిరునవ్వు మోహం మీద తేరాడుతుండగా అలాగే శాశ్వత నిద్రలోకి ఒరిగింది.

★



## నమ్మకం

తారలకి వివిధ రకాల నమ్మకాలుంటాయి. తమ జన్మనక్షత్రాన్ని బట్టి వారు ముందుకెళుతుంటారు. కరీనాకపూర్ కూడా ఇప్పుడు ఈ నమ్మకం తోనే ఉంది. కుండలినీ సూత్రాల్ని ఆమె బాగా ఆచరిస్తోంది. "సినిమాల్లో నటించడం మొదలుపెట్టాక సక్సెస్ కోసం ఇలాంటి సూత్రాలు ఆచరిం చడం ఎక్కువైపోయింది. ఎందుకంటే ఏ సూత్రం పాటించకున్నా మనమీద మనకు నమ్మకం తగ్గిపోతుంది. అందుకే జ్యోతిష్యుల మాటని అనుసరించి వాటిని ఆచరించడమే మంచిది కదా! నేనిప్పుడు చేస్తున్నది కూడా అదే" అంటోంది కరీనా.

